ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బాలాజీనగర్ కాలనీలో శ్రీ శివ ఆంజనేయ సహిత రామాలయం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకట్ చౌదరి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక విడుదల


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి హైకోర్టు కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవాలయం షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, ప్రసాద్‌రావు, సూర్యనారాయణ, ఉమా మహేశ్వర్ రావు, మురళీకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వనస్థలిపురం: వనస్థలిపురం చింతలకుంట రేడియో కాలనీలోని తపస్వీ పాఠశాల 6వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రదీప్‌కుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, రవికుమార్, నర్సింహారావు, అజయ్‌యాదవ్, వెంకటేష్, సాగర్‌రెడ్డి, వాసుచౌదరి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చాదర్‌ఘాట్: రహదారులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. ఆదివారం మలక్‌పేట నియోజకవర్గంలోని అజంపురాలో ఏ టు జెడ్ సేవ్ ఎర్త్ (ఏఎస్‌ఈజెడ్), వుయ్ ఆర్‌వన్ (డబ్ల్యూఏఓ), చర్చ్ ఆఫ్ గాడ్ యూత్ వలంటీర్ గ్రూప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారుల పరిశుభ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రహదారులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అందరూ నగరాన్ని చెత్తరహితంగా ఉంచటంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజంపురా కార్పొరేటర్ షేక్ మొహియుద్దీన్ అబ్రార్, సంస్థల ప్రతినిధులు కిమ్ యోంగ్ గాబ్, జెస్సీ, ప్రసాద్, సంస్థలకు చెందిన 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుల పరస్పర దాడులు

సైదాబాద్: పలువురు యువకులు పరస్పర దాడులకు పాల్పడిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సింగరేణి కాలనీలో నివసించే జగన్, హర్ష, మధు, చంటి శనివారం రాత్రి చాంద్రాయణగుట్టకు డిన్నర్‌కు వెళ్లి తిరిగి వచ్చి గణపురం గుడిసెల వద్ద ఉన్న జగన్ ఇంటి వద్ద నిల్చుని మాట్లాడుకుంటున్నారు. అప్పుడే స్థానికంగా నివసించే ముడావత్ సురేష్ అక్కడికి వచ్చి జగన్‌తో గొడవకు దిగాడు. హర్ష తదితరులు వారిని నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. ఇంటికి వెళ్లిన సురేష్ కత్తి తీసుకొని మళ్లీ వచ్చి జగన్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకోబోయిన హర్షకు గాయాలయ్యాయి. అంతటి ఆగకుండా సురేష్ రాత్రి మళ్లీ జగన్ ఇంటికి వెళ్లి కత్తితో దాడికి యత్నిస్తుండగా జగన్ అతడి కత్తి గుంజుకొని పొడవడంతో సురేష్‌కు గాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షేమ హాస్టళ్లు..
సమస్యల లోగిళ్లు


నీళ్లచారు


ఉడికీ ఉడకని అన్నం

ప్రభుత్వ వికలాంగ వసతి గృహాల్లో కానరాని కనీస వసతులు

- స్టాఫ్ నర్సులే వార్డెన్‌గా ఇన్‌చార్జీలు
- సిబ్బంది, సహాయక ఉద్యోగులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు


చంపాపేట బాలుర వికలాంగ హాస్టల్‌లో కుంగిన బండలు



చంపాపేట: అవి పేరుకే సంక్షేమ హాస్టళ్లు.. టాయ్‌లెట్స్‌కు తలుపులుండవు.. లోపల నీళ్లు రావు.. అపరిశుభ్రత పురాతన శిథిలావస్థకు చేరిన భవనం. హాస్టల్ భవనంలోని గదుల ముందే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్. నిత్యం మురుగు కంపుతో పాటు దోమలు, ఈగలు, ఎలుకలు, బొద్దింకల స్వైర విహారం. అది చాలదన్నట్లు తినేందుకు వీలుపడని రాళ్లు, ఇసుకతో ముద్ద అన్నం, నీళ్లచారు, ఉడికీ ఉడకని కూరలతో ముద్ద మింగుడు పడని దుస్థితి. ఇది ఎల్‌బీనగర్‌లోని పలు ప్రభుత్వ బాలుర, బాలికల వికలాంగ విద్యార్థుల హాస్టళ్ల దుస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో చైతన్యపురి ఫణిగిరి, సంతోషిమాతా, రెడ్డికాలనీ, చంపాపేటలోని ప్రభుత్వ వికలాంగుల హాస్టళ్లలో మొత్తం 564 మంది వికలాంగ విద్యార్థులు చేతివృత్తులపై శిక్షణ పొందేవారు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు వసతిని పొందుతున్నారు.

చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలో..

చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలోని నాలుగు దశాబ్దాల పురాతన శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో 18 ఏళ్లుగా హాస్టల్ కొనసాగుతుంది. వసతిగృహంలో 195 మంది వికలాంగ విద్యార్థులు ఉంటూ ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు పుస్తకాలతో కుస్తీ పడుతూనే మౌలిక సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. హాస్టల్‌లో విధులు నిర్వర్తించే కుక్‌కు, ఇతర సిబ్బందికి పది మాసాలుగా వేతనాలు రాకపోవడంతో వారు తరచూ విధులకు గైర్హాజరు అవుతున్నారు. దీంతో నిత్యం వంట చేసేందుకు బయటి వారిపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడింది. వార్డెన్ రెగ్యులర్ పోస్ట్ లేకపోవటంతోనే స్టాఫ్ నర్సే ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తుంది. శిథిలావస్థకు చేరిన పురాతన భవనం కావటంతో పైఫ్లోర్ నుంచి వాటర్ లీకేజీ..గ్రౌండ్ ఫ్లోర్‌లోని బండలు కుంగిపోయి గుంతలుగా ఏర్పాడ్డాయి. మంచాలు, బెడ్స్, దుప్పట్లు నోట్ బుక్స్, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడతో నానా ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు.

చైతన్యపురి ఫణిగిరి కాలనీలో..

చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని ప్రభుత్వ వికలాంగ హాస్టల్‌లో 75 మంది వికలాంగ విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ట్రైనింగ్ కం ప్రొడక్షన్ రెండస్తుల భవనంలోనే అరకొర వసతులు ఉన్న ప్రభుత్వ వికలాంగ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. సిబ్బంది కుక్, సహాయక కుక్‌లు మాత్రమే ఉన్నారు. ప్రతీ పది మంది విద్యార్థులకు ఒక సహాయక సిబ్బంది ఉండాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం శూన్యం. ప్రతీ విద్యార్థికి కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ 250 రావాల్సి ఉండగా దాదాపుగా రెండేళ్ల నుంచి అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌బీనగర్ సంతోషీమాత కాలనీలో..

ఎల్‌బీనగర్ సంతోషీమాత కాలనీలోని రెండు అతస్తుల కిరాయి ప్రభుత్వ హాస్టల్ భవనంలో 196 మంది వికలాంగ విద్యార్థులు వసతిని పొందుతున్నారు. హాస్టల్‌లో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ నాణ్యతతో ఉన్న భోజనం ఉండటం లేదని, కాస్మోటిక్ చార్జీలు రెండు సంవత్సరాలుగా అందడం లేదని, బెడ్స్, బెడ్‌షీట్స్ కొందరికే అందించారని మిగిలిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. భోజనంలో రాళ్లు, పురుగులు, ఇసుక, నీళ్ల చారు, ఉడికీ ఉడకని కూరలతో తాము పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో సమస్యలకు పరిష్కారం..

త్వరలో హాస్టల్స్‌లో విధులు నిర్వర్తించే సిబ్బందికి వేతనాలు అందించటంతో పాటు విద్యార్థులకు పెండింగ్ కాస్మోటిక్ చార్జీలు, నోట్ బుక్స్, దుప్పట్లను పూర్తి స్థాయిలో అందిస్తాం. మెనూ ప్రకారమే అల్పాహారం, భోజనం అందిస్తున్నాం. మా దృష్టికి వచ్చిన మౌలిక సదుపాయాలపై వెంటనే స్పందిస్తున్నాం.

– సంధ్యారాణి, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి

ఇంత నిర్లక్ష్యమా?



పురాతన శిథిలావస్థకు చేరిన భవనంలో మౌలిక సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తినడానికి అన్నం సరిగ్గా ఉండదు. మా గదుల ముందే మురుగు పరుగులు తీస్తోంది. గుంతలుగా మారిన గ్రౌండ్ ఫ్లోరింగ్, కిటికీలకు తలుపులు, దోమ తెరలు లేవు. మరుగు దొడ్లలో ముక్కుపుటలు అదిరే దుర్వాసవ వస్తోంది. ఏడాదిన్నర కాలంగా నోట్ పుస్తకాలు లేవు.

– రాంచందర్, చంపాపేట, ప్రభుత్వ వికలాంగ బాలుర హాస్టల్ విద్యార్థి

మౌలిక వసతులు కల్పించాలి



17 ఏళ్లుగా పురాతన భవనంలో సమస్యలతోనే సహజీవనం చేస్తున్నాం.ఇక్కడ ఉండలేక పోతున్నాం, బయటకు వెళ్లలేక పోతున్నాం. మేం ఎలా బతికేది. గత పదేళ్ల క్రితం వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా సంక్షేమ శాఖలో విలీనం చేయటంతోనే సమస్యలు అధికమయ్యాయి. విలీనాన్ని రద్దు చేయాలి.

– రమేష్, చంపాపేట హాస్టల్ పీజీ విద్యార్థి

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న బీఎంఎస్ నేతలు

మన్సూరాబాద్: డీసీఎం యజమానులను డబ్బులు చెల్లించకుండా స్మార్ట్ స్విఫ్ట్ లాజీ కార్ట్స్ యాజమాన్యం మోసాలకు పాల్పడుతుందని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హబీబ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. డీసీఎం యజమాన్యులకు పెండింగ్ పేమెంట్స్ వెంటనే చెల్లించాలని కోరుతూ ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయం ఎదుట డీసీఎం యాజమానులతో కలిసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పలువురు డీసీఎం యాజమానులతో సంస్థ సిబ్బంది డీసీఎంలను నెలవారీగా అద్దెకు తీసుకుని సరకులను రవాణా చేస్తున్నారన్నారు. అమెజాన్, ఫ్లిక్ కార్ట్ సంస్థల సరుకులను లాజీ కార్ట్స్ పేరుతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని, పేరున్న కంపెనీలు పలువురు డీసీఎంల యజమానులు సంస్థతో సరుకుల రవాణాకు ఒప్పందం చేస్తున్నారన్నారు. సంస్థ యాజమాన్యం స్పందించి డీసీఎం యజమానుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

చాదర్‌ఘాట్: వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఆదివారం ట్రేడ్‌లైసెన్స్ విభాగంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్సు పొందని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ చేసుకోనట్లైతే షెడ్యూల్ ప్రకారం జరిమానాలు విధించబడుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్ డిసెంబర్ 31, 2024తో ముగిసిందని, కొత్తగా జనవరి 31, 2025 లోపు ఆయా వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ చేసుకోలేని వారు అదనపు రుసుము చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

వైభవంగా నవచండీ యాగం



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురంకాలనీలో ఆదివారం నిర్వహించిన రుద్ర సహిత నవచండీ మహాయాగంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమ్మవారి కృపా కటాక్షాలు పొందడం ఆనందంగా ఉందన్నారు. రాజరాజేశ్వరి పీఠం జగన్మాత సేవలో మొల్లూరి నవీన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాయాగంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రియాంక మధుసూదన్‌రెడ్డి, పద్మారెడ్డి, నర్సింహారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, జంగయ్యగౌడ్, కాంతారావు, సురేష్‌కుమార్ కిషోర్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు


కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న డైమండ్‌నగర్‌కాలనీ వాసులు

హస్తినాపురం: డివిజన్ పరిధి వివిధ కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని విజయదుర్గాకాలనీ, బాలాజీనగర్‌కాలనీ, డైమండ్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, మాన్కోటియా, భాస్కర్‌రెడ్డి , సిరాజ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మహేశ్వరం: మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 45రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు పాల్గొంటున్నాయి. గ్రామానికి చెందిన నాయకుడు ఎడ్ల వాసుదేవారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. రెడ్ బుల్స్, మామిడిపల్లి సూపర్ కింగ్స్, నైట్ వాకర్స్, టీం జగన్, బెంగాల్ టైగర్స్, కింగ్ ఫిషర్, ఆర్‌బీఎం వారియర్స్ తదితర జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ.35వేలు, రన్నరప్‌కు రూ.25 వేల నగదు పురస్కారాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. మామిడిపల్లి గ్రామంలో యువకులంతా ఏకతాటిపైకి వచ్చి క్రికెట్ ఆడడం అభినందనీయమన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై కొంత సమయం కేటాయిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ఉమర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఆటలు ఆడడం ద్వారా శారీరకంగా దృడంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. బస్తీ యువత సౌకర్యార్థం ఇలాంటి గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న రంజాన్‌మాసం సందర్భంగా మజీద్‌ల పరిసరాలలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్య లేకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి

మీర్‌పేట: సెల్‌ఫోన్ నుంచి పిల్లలను దూరంగా ఉంచాలని ప్రముఖ కిడ్నీ స్పెషలిస్ట్ డా.రాధాకృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీవిద్యా వాణి హైస్కూల్ వార్షికోత్సవ వేడుక శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డా.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులు తరుచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని చందన హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చందన, మురళీ, కిరణ్, నాయకులు అరవింద్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సతీష్‌కుమార్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ షాపుల వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చింతలకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన వనస్థలిపురం టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత కొన్ని రోజుల క్రితం మృతిచెందిన నరేష్ కుటుంబ సభ్యులకు అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన రూ. 2 లక్షలను ఎమ్మెల్యే అందజేశారు. తమ అసోసియేషన్ కోసం కొంత స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, అసోసియేషన్ సభ్యులు అరవింద్‌రెడ్డి, మొయిన్, నరేందర్‌రెడ్డి, ప్రసాద్, దామోదర్‌గౌడ్, అజయ్, నర్సింహా యాదవ్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

చిన్న చెరువుపై నిఘా పెంచాలి


చెరువు కట్టపై పర్యటిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: అసాంఘిక కార్యకలాపాలకు మన్సూరాబాద్ చిన్న చెరువు అడ్డాగా మారిందని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సెంట్రల్‌బ్యాంక్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కాలనీలో పర్యటించి అనంతరం చిన్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులో భవన వ్యర్థాల శిథిలాలు వేసి పూడ్చుతున్నారని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నారు. చిన్న చెరువులోకి యువత గంజాయి, మద్యం తాగి చిందులు వేస్తున్నారని, పోలీసులు నిఘా పెంచాలన్నారు. సెంట్రల్ బ్యాంక్‌కాలనీలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామని, కాలనీలోని మిగిలిపోయిన సీసీ రోడ్లు త్వరలోనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట తిరుమల్‌రెడ్డి, హరీష్ రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, దీపు ఉన్నారు.

ఆకట్టుకున్న అన్వేషణ సైన్స్ ఫెయిర్


సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న సినీనటుడు సుమన్

హస్తినాపురం: అన్వేషణ–25 కార్యక్రమంలో ప్రదర్శించిన రోబోతో అగ్నిమాపక యంత్రం, సెన్సార్‌ను ఉపయోగించి రోడ్డు ప్రమాదాలను నియంత్రించే యంత్రం శాటిలైట్ కమ్యూనికేషన్ విధానం కాలుష్య నివారణ యంత్రాల తయారు అద్భుతంగా ఉందని సినీనటుడు సుమన్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండిపుల్లారెడ్డి గార్డెన్ దగ్గర ఉన్న నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయరంగంలో ఉపయోగపడే ఆధునికయంత్రాలు, వివిధ వనరులతో విద్యుత్ తయారీ విధానం, మానవ శరీర భాగాలైన గుండె, మెదడు, ఊపిరితిత్తులు, కాలేయం , పనిచేసే విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గణిత శాస్త్రంలో ఫజిల్స్ రసాయన శాస్త్రంలో వివిధ వాయువుల తయారీ విధానాలపై విద్యార్థులు వివరించిన తీరు బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగరాణి, మదనాచారి, సదాశివుడు, గురునాథం పాల్గొన్నారు.

వీధి కుక్కలకు నీటితొట్లు ఏర్పాట్లు


తొట్లలో నీరు పోస్తున్న డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్: వేసవిలో వీధి కుక్కలకు నీటి ఎద్దడి నివారణకు కాలనీలు, పార్కుల వద్ద నీటి తొట్లను ఏర్పాట్లు చేస్తున్నామని ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఆదివారం ఆయన పలు ప్రాంతాల్లో కుక్కల కోసం తొట్లను ఏర్పాటు చేసి తాగునీటిని అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధి కుక్కలకు వేసవిలో నీటి వసతి లేకపోవడంతో దప్పికతో ప్రజలపై దాడులు చేసే ప్రమాదం ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలోని పలు కాలనీలో సుమారుగా 1200 నీటి తొట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కాలనీలవాసులు కూడా నీటి తొట్లను ఏర్పాటు చేయాలని కోరారు.

స్వచ్ఛ భారత్ స్ఫూర్తిదాత సంత్ గాడ్గేబాబా



సంత్ గాడ్గేబాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగోలు: స్వచ్ఛ భారత్ స్ఫూర్తిదాత, ఉద్యమకారుడు సంత్ గాడ్గే బాబా అని బీసీ ఉద్యమ నేత కటకం నర్సింగ్‌రావు అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీలో ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడుతూ.. రజక (చాకలి) కుటుంబంలో జన్మించిన సంత్‌గాడ్గే బాబా దేశంలో అంటరానితనం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేశారన్నారు. స్వచ్ఛతపై ఆయన చేసిన ప్రచారం మహారాష్ట్ర సమాజంపై గణనీయమైన ప్రభావం చూపింది. స్వయంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంత్‌గాడ్గే బాబాను తన గురువుగా ప్రకటించుకున్నాడన్నారు. అనేక విద్యాలయాలు, ధర్మశాలలు ఆస్పత్రులు మహారాష్ట్రలో సంత్ గాడ్గే బాబా పేరుతో విశ్వావిద్యాలయం స్థాపించారన్నారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ.. గాడ్గే బాబా ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహబెస్త, బొడ్డుపల్లి మధు, మద్దెల విజయ్ కుమార్, లింగస్వామి, రమేష్, అశోక్, శాలినిప్రియా, గౌరీ, రత్నం,పుష్ప, శంకర్, రేవల్లి నరేష్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ రజక, రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురం చౌరస్తాలో..

దిల్‌సుఖ్‌నగర్: కుల వివక్షపై, స్వచ్ఛ భారత్ స్ఫూర్తికి మూలపురుడు సంతు గాడ్గే మహరాజ్ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి పగడాల ఎల్లన్న ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చౌరస్తాలో సంతు గాడ్గే బాబా మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి పాల్గొని గాడ్గే మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖిల్లా మైసమ్మ ఆలయ డైరెక్టర్ పగడాల శ్రీశైలం, యాదవ రెడ్డి, పెద్దపూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, లింగస్వామి గౌడ్, అంజన్ రావు, చిలక రాజు, సాయి, జగదీష్, బొడ్డుపల్లి నగేష్, పగిళ్ల అంజి, సాయి, ప్రశాంత్, విప్లవ, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు మానవతా విలువలు పెంపొందించుకోవాలి


వేడుకల్లో సినీ హీరో సాయి కిరణ్

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు మానవతా విలువలను పెంపొందించుకోవాలని సినీ హీరో సాయి కిరణ్ అన్నారు. చంపాపేట నలంద గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవం ఆదివారం కొత్తపేట బీజేఆర్ భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సినీ హీరో సాయి కిరణ్ హాజరై మాట్లాడుతూ..విద్యార్థులు చదువులతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..తమ పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాలల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటి లక్ష్మి వర్ష, ప్రముఖ జ్యోతిష్యుడు రామ్మోహన్, ప్రముఖ విద్యావేత శశాంక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.